సాహితీ వాణి

(A Monthly Peer-Reviewed Online Multidisciplinary Telugu Research Journal)

Literature & Language| Linguistics| Arts & Humanities|Histroy

Publishing by: Dr.Lakshamanarao Adimulam, Sri Mayuri Finearts Association , Regd No: 94/2024, H.No: 5-227, Srirampuram Post, G.S.L Medical College (So), Raganagaram Mandalam, East Godavari - 533296, Cell: 8522967827

Volume – 1, July 2026, issue – 4

## సి.నా.రె. – తెలుగు సాహిత్యాకాశంలో చిరంజీవి ధ్రువతార

తెలుగు సాహిత్య చరిత్రలో యుగయుగాల పాటు నిలిచిపోయే మహనీయులలో డా. సి. నారాయణరెడ్డి (సి.నా.రె.) గారి స్థానం విశిష్టమైనది. కవి, గేయరచయిత, పరిశోధకుడు, అధ్యాపకుడు, విమర్శకుడు, వక్త, సాహిత్యవేత్త . సాహిత్యం అంటే కేవలం పదాల సమాహారం కాదని, అది సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి అని తన రచనల ద్వారా నిరూపించిన మహోన్నత వ్యక్తిత్వం సి.నా.రె.

తెలుగు భాషలో సాంప్రదాయ కవిత్వ సౌందర్యాన్ని ఆధునిక భావజాలంతో సమన్వయం చేసిన అరుదైన సృష్టికర్త ఆయన. ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి పదం భావగాంభీర్యంతో, మానవీయ విలువలతో, సాంస్కృతిక చైతన్యంతో నిండి ఉంటుంది. తెలుగు భాష యొక్క మాధుర్యాన్ని ప్రపంచానికి చాటిన సాహిత్య రాయబారిగా ఆయనను అభివర్ణించడం అతిశయోక్తి కాదు.

సి.నా.రె. గారి రచనలు కేవలం పాఠకులను అలరించడమే కాదు ఆలోచింపజేస్తాయి, చైతన్యవంతులను చేస్తాయి. ప్రేమ, ప్రకృతి, మానవత, జాతీయత, సామాజిక బాధ్యత వంటి అనేక అంశాలు ఆయన సాహిత్యంలో సహజంగా మిళితమై కనిపిస్తాయి. సంప్రదాయాన్ని గౌరవిస్తూ నవ్య ఆలోచనలకు స్వాగతం పలికిన సాహిత్యదృష్టి ఆయనది.

ఆయన రచించిన "**విశ్వంభర**" మహాకావ్యం తెలుగు సాహిత్య వైభవానికి ప్రతీకగా నిలిచింది. ఈ రచనతో మానవ నాగరికత పరిణామం, మానవతా విలువలు, విశ్వశాంతి వంటి విశాల భావాలను అత్యంత కళాత్మకంగా ప్రతిపాదించారు. ఈ మహోన్నత సాహిత్య సృష్టికి భారత అత్యున్నత సాహిత్య పురస్కారమైన **జ్ఞానపీఠ పురస్కారం** లభించడం తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి గర్వకారణం.

సాహిత్యంతో పాటు సినీ గేయరచనలోనూ ఆయన సృష్టించిన ముద్ర చిరస్మరణీయం. వేలాది పాటల ద్వారా తెలుగు భాషకు కొత్త సొబగులు అద్దారు. శాస్త్రీయత, సాహిత్య విలువలు, సంగీత మాధుర్యం ఈ

మూడింటి సమన్వయంతో ఆయన గీతాలు తరతరాల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వినోదంతో పాటు విలువలను అందించే గేయాలను రచించడం ఆయన ప్రత్యేకత.

గురువుగా ఆయన అనేక మంది విద్యార్థుల్లో సాహిత్యాసక్తిని పెంపొందించారు. పరిశోధకులకు మార్గదర్శకుడిగా, వక్తగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యాభివృద్ధికి అపార సేవలందించారు. సాహిత్యం సమాజానికి అద్దం పట్టాలని, మనిషిని మరింత మానవీయుడిగా తీర్చిదిద్దాలని ఆయన నమ్మకం.

## రావూరి భరద్వాజ – జీవితాన్ని సాహిత్యంగా మలిచిన మహాకథకుడు

తెలుగు సాహిత్య చరిత్రలో ప్రజల జీవితాన్ని అక్షరాలుగా మలిచి, సాహిత్యాన్ని సమాజానికి అద్దంగా నిలిపిన మహనీయులలో రావూరి భరద్వాజ గారి స్థానం అత్యున్నతమైనది. ఆయన కేవలం కథకుడు, నవలా రచయిత మాత్రమే కాదు. సమాజంలోని సామాన్య మనిషి బాధ, శ్రమ, ఆశ, నిరాశ, ఆత్మగౌరవం, జీవన పోరాటాన్ని సాహిత్య చరిత్రలో శాశ్వతంగా నిలిపిన ప్రజారచయిత. జీవితానుభవాలను సాహిత్యానుభూతులుగా మలచిన అరుదైన సృజనకర్తగా ఆయన తెలుగు పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు.

సాహిత్యం సమాజం నుంచి పుడుతుంది; సమాజానికే దారి చూపాలి అనే భావజాలానికి రావూరి భరద్వాజ గారి రచనలు ప్రతీక. ఆయన కల్పిత ప్రపంచాలను నిర్మించలేదు; మన చుట్టూ కనిపించే మనుషులనే సాహిత్య పాత్రలుగా మలిచారు. అందుకే ఆయన కథలు చదివినప్పుడు పాత్రలు మన ఇంటి వారిలా, మన ఊరి వారిలా, మన జీవితంలోని సంఘటనల్లా అనిపిస్తాయి. అదే ఆయన రచనా వైశిష్ట్యం.పేదరికం, ఆకలి, నిరుద్యోగం, కూలీల జీవితం, స్త్రీల సామాజిక స్థితి, కళాకారుల ఆవేదన, మధ్యతరగతి సంక్షోభం వంటి సామాజిక అంశాలను ఆయన అత్యంత సహజంగా చిత్రించారు. ఆయన రచనల్లో ఎక్కడా కృత్రిమత కనిపించదు.

రావూరి భరద్వాజ గారి రచనలలో "**పాకుడురాళ్లు**" నవలకు ఒక విశిష్టత స్థానం ఉంది . తెలుగు సినీ ప్రపంచం వెనుక దాగి ఉన్న మానవ సంబంధాలు, కళాకారుల ఆశలు, నిరాశలు, అవకాశాల కోసం జరిగే పోరాటం, ఖ్యాతి వెనుక దాగి ఉన్న విషాదాన్ని ఈ నవల హృద్యంగా ఆవిష్కరిస్తుంది. ఇది కేవలం సినీ ప్రపంచం గురించిన కథ కాదు; మనిషి తన అస్తిత్వం కోసం చేసే

నిరంతర అన్వేషణకు ప్రతీక. ఈ నవలకు లభించిన జ్ఞానపీఠ పురస్కారం తెలుగు నవలా సాహిత్యానికి జాతీయ స్థాయిలో విశిష్ట గౌరవాన్ని తీసుకొచ్చింది.

ఆయన విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించకపోయినా, జీవితాన్నే విశ్వవిద్యాలయంగా స్వీకరించారు. కష్టాలను గురువులుగా, అనుభవాలను పాఠ్యపుస్తకాలుగా మలచుకొని సాహిత్య శిఖరాలను అధిరోహించారు. ఇది యువ రచయితలకు గొప్ప స్ఫూర్తి. ప్రతిభ, పట్టుదల, పరిశీలనా దృష్టి ఉంటే సాధారణ వ్యక్తి కూడా అసాధారణ సాహిత్యాన్ని సృష్టించగలడని ఆయన జీవితం నిరూపించింది.

రచయితగా ఆయనకు ఉన్న గొప్ప లక్షణం మానవత్వం. వర్గాలు, కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా మనిషిని కేంద్రంగా ఉంచి రచనలు చేశారు. సామాజిక అసమానతలను ప్రశ్నించినా, ఎక్కడా ద్వేషాన్ని ప్రోత్సహించలేదు. బాధితుడి పట్ల సానుభూతిని, సమాజం పట్ల బాధ్యతను, మానవ సంబంధాల పట్ల గౌరవాన్ని ఆయన ప్రతి రచనలో ప్రతిపాదించారు.

తెలుగు పరిశోధన రంగంలో రావూరి భరద్వాజ గారి రచనలపై ఇంకా విస్తృత అధ్యయనం జరగాల్సిన అవసరం ఉంది. ఆయన కథన శైలి, భాషా సరళి, పాత్రల నిర్మాణం, వాస్తవిక దృక్పథం, సామాజిక చైతన్యం, స్త్రీ పాత్రల చిత్రణ, శ్రామిక జీవన విశ్లేషణ వంటి అంశాలు పరిశోధకులకు విశాలమైన అధ్యయన క్షేత్రాలు. విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, సాహిత్య వేదికలు ఈ దిశగా మరింత కృషి చేయాలి.

తెలుగు సాహిత్యంలో తమకంటూ ఒక చరిత్రను సృష్టించుకున్న వీరిద్దరూ ఒకే నెల జూలై లో జన్మించడం యాదృచ్ఛికం కావచ్చు. ఇద్దరు మహనీయులను ఒకేసారి స్మరించుకునే అవకాశం రావడం మన అదృష్టం అనే చెప్పాలి.

**జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు సినారె, రావూరి భరద్వాజ జయంతిని పురస్కరించుకుని సాహితీవాణి వారికి సాహితీ నివాళులు అర్పిస్తుంది.**

**–డా.లక్ష్మణ రావు ఆదిమూలం (అరసి శ్రీ),**

**ప్రధాన సంపాదకులు.**